# ఆందోళన నుంచే ఆలోచన

**ప్లాస్టిక్ సంచుల వాడకం మంచిది కాదని అందరికీ తెలిసినా వాడటం మానలేదు. వీటివల్ల పర్యావరణానికి జరుగుతున్న హాని, భవిష్యత్తు తరాలకు జరిగే కీడుగురించి ఎవరూ ఆలోచించడం లేదని న్యాయస్థానాలు సైతం ఆందోళన వ్యక్తంచేశాయి. ఈ విషయం ఓ వనితను ఆలోచింపజేసింది. ప్రత్యామ్నాయ మార్గాల వైపు ప్రజలను మళ్లించడం తన బాధ్యత అనుకున్న ఆమె ఆచరణకు ఉపక్రమించారు. తద్వారా తనతోపాటు మరికొందరికీ ఉపాధి కల్పించగలిగారు.**



**ప్లా**స్టిక్ సంచుల బదులుగా వాడేందుకు కాగితం సంచులను తయారుచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తే పర్యావరణాన్ని పరిరక్షించడంలో తనవంతు పాత్ర పోషించవచ్చని భావించారు యామిని కోగంటి. హైదరాబాదులో చేతి సంచుల తయారీ యూనిట్‌ను నిర్వహిస్తున్నారామె. ఓ వైపు జీవితబీమా ఏజెంటుగా చేస్తూనే మరోవైపు పరిశ్రమనూ నిర్వహిస్తున్న యామినిని పలకరించింది 'వసుంధర'.

యామినిది కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు. విజయవాడకు చెందిన విజయభాస్కర్‌తో 1994లో వివాహమైంది. అతనికి హైదరాబాదులో ఉద్యోగం రావడంతో ఇక్కడ స్థిరపడ్డామని చెప్పారు యామిని. తాను ఖాళీగా ఉండకుండా బీమా ఏజెంటుగా చేరారు. డిగ్రీ చదివిన తనకు ప్లాస్టిక్ సంచుల తాలూకు అనర్థాల గురించి బాగా తెలుసని అంటారామె. ప్లాస్టిక్‌వల్ల జరిగే హాని గురించిన వివరాలు ఆమెను కదిలించాయి. ప్రత్యామ్నాయంగా కాగితపు చేతిసంచులను తయారు చేయాలనుకున్న యామిని భర్తతో ఆ విషయం చర్చించారు. 'ఆయన కూడా నా ఆలోచనతో ఏకీభవించారు. కాగితపు సంచుల పరిశ్రమ స్థాపించడానికి సహాయపడ్డారు. రూ.16 లక్షలతో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేశా. మొదట్లో సాదా సంచుల్ని తయారుచేశాం. వాటికి వినియోగదారుల నుంచి సరైన స్పందన రాలేదు. అనుభవజ్ఞుల సలహాలు తీసుకుని రకరకాల డిజైన్లలో తయారుచేయడం మొదలుపెట్టా. ఈసారి మంచి స్పందన వచ్చింది. నిదానంగా ఆర్డర్లు తీసుకుని ఎవరికి ఎలా కావాలంటే అలా తయారుచేయడం ప్రారంభించా. వ్యాపారం పుంజుకుంది. పేర్లు రాసి బహుమతులు ఇవ్వడానికి, తాంబూలాలు పంచడానికి, కిట్టీ పార్టీలకు, కంపెనీల లోగోలను ముద్రించుకునేందుకు వీలుగా ఈ సంచులను తయారు చేయడం వల్ల మంచి ఆదరణ లభిస్తోంది. వీటి తయారీకి స్థానికంగా లభించే నాణ్యమైన క్రాఫ్ట్ పేపర్ ఉపయోగిస్తున్నా..' నంటూ చెప్పుకొచ్చారు యామిని.

చేతిసంచుల తయారీ పరిశ్రమలో 12మంది మహిళలకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నారు యామిని. ఈ పని 60శాతం యంత్రంతోనూ, 40శాతం చేతులతోనూ చేయాల్సి ఉంటుంది. తుదిమెరుగులు దిద్దే పనంతా మహిళలే చేస్తారు. డిజైన్లు మాత్రం ఇతరుల చేత చేయిస్తానని చెప్పారు యామిని. అయిదు వేల సంచులు కావాలన్నా వెంటనే చేసివ్వగల సామర్థ్యం ఉందని ఆమె గర్వంగా చెప్పారు. అమ్మకాలకు ఆమె సాంకేతిక ప్రగతిని వినియోగించుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో ఆర్డర్లు తీసుకోవడం, విక్రయించడం చేస్తున్నారు. దీని వల్ల ఎంతో సమయం కలిసొస్తోందంటారు యామిని. ఉత్పత్తిని పెంచేందుకు పరిశ్రమను విస్తరించనున్నానని చెప్పారామె.

ప్రజల్లో కాగితపు సంచుల వినియోగంపై ఇంకా అవగాహన పెరగాలనే యామిని తనలాంటి వారికి ప్రభుత్వం కూడా తగినంత ప్రోత్సాహం ఇవ్వాలని ఆశిస్తారు. ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, సంస్థల్లోనూ వీటి వినియోగాన్ని ప్రోత్సహిస్తే తనలాంటివారికి ఉత్సాహంగా ఉంటుందంటారామె.

– వడ్డే మారెన్న
న్యూస్‌టుడే, హైదరాబాద్


INDIA's
INTER
'Bring this pape
CREDIT
'Get One Free
NEXT
Main Sponsor
LG
INTERN
WW
Date
Timing